క్లుప్తంగా

పోతునూరులో ఉత్సవాలకు ఏర్పాట్లు



ఉత్సవాలకు ముస్తాబైన పోతునూరు ఆర్‌సీఎం పరిశుద్ధ నిత్యసహాయమాత దేవాలయం

దెందులూరు: పోతునూరులో ఈ నెల 23,24,25 తేదీల్లో ఆర్‌సీఎం పరిశుద్ధ నిత్య సహాయమాత ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఏలూరు పీఠం యూత్ డైరెక్టర్ పోతునూరు ఆర్‌సీఎం పారీస్ క్రైస్ట్ ఫాదర్ పీ.డేవిడ్ తెలిపారు. పోతునూరుతోపాటు సమీప గ్రామాల్లోని భక్తులు నిత్యసహాయ మాత ఉత్సవాల్లో పాల్గొని దీవెనలు పొందాలని ఆయన కోరారు.

నేడు వ్యాయామ విద్యా కళాశాలలో పోటీలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాలలో శనివారం క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా, టోర్నమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ పీడీకేడీ ప్రసాద్ తెలిపారు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషులు, మహిళలు అండర్–14, 19 విభాగాల్లో పాల్గొనే క్రీడాకారులను ఈ పోటీల ద్వారా ఎంపిక చేస్తామన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గణపవరం: పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటిస్తేనే ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చునని వైద్య సిబ్బంది అన్నారు. శుక్రవారం గణపవరం మండలం చిలకంపాడు, కాశిపాడు గ్రామాల్లో పరిశుభ్రతపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి, వ్యాధుల రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగునీటి కుంటలు లేకుండా చూసుకోవాలని, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గోళ్లు ఎప్పటికప్పుడు కత్తిరించుకుని సబ్బుతో కడుక్కోవాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఆరోగ్యసహాయకుడు నామాలరాజు, హెచ్‌ఎం చింతలపాటి భవాని, రమేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సొంతిల్లు ప్రభుత్వ లక్ష్యం



నడిపల్లి జగనన్న గృహాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ ఎండీ లక్ష్మీషా, తహసీల్దార్, ఎంపీడీఓ, ఇతర రెవెన్యూ సిబ్బంది

పెదవేగి : అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సొంతిల్లు అందించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని హౌసింగ్ ఎండీ లక్ష్మీషా చెప్పారు. పెదవేగి మండలం విజయరాయి, నడిపల్లి, పెదవేగి గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న జగనన్న లే అవుట్‌లోని గృహాలను లక్ష్మీషా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ పేదలందరికీ సొంతిల్లు అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ రాజీమనోజ్, వీఆర్‌ఓలు, సిబ్బంది ఉన్నారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: ఒక బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు అందడంతో శుక్రవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం మండలంలోని సత్తాల పంచాయతీ సంద్రకుంటకు చెందిన బొప్పన వెంకటేశ్వరరావుకు ఇద్దరు కుమారులు సంతానం. అందులో 17 సంవత్సరాల వయస్సుగల చిన్నకుమారుడు బొప్పన కొండబాబు 10వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 18న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రించిన కొండబాబు, ఆ మరుసటి రోజు ఉదయం నుంచి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు అతడి సెల్ నంబర్‌కు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ అని వస్తోంది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో వెంకటేశ్వరరావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సచివాలయం తనిఖీ

లింగపాలెం: లింగపాలెం మండలం భోగోలు గ్రామ సచివాలయాన్ని జెడ్పీ సీఈవో రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరును పీఎంజేఏవైఐ సర్వేను సీఈవో రవికుమార్ పరిశీలించారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు చేశారు.

గడపగడపకూ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే వాసుబాబు
- ఉంగుటూరులో 119వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న వాసుబాబు

ఉంగుటూరు(గణపవరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో అర్హత కలిగిన ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం ఉంగుటూరులో నిర్వహించిన 119వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాలు వివరించారు. పేదల సంక్షేమానికి నవరత్నాల పథకాలద్వారా ముఖ్యమంత్రి జగన్ నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకుని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇన్ని సంక్షేమ పథకాలను దేశంలోనే ఏరాష్ట్రంలోనూ అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఈఘనత మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎవరికైనా అర్హత ఉండి పథకాలు అందకపోతే వెంటనే వారికి ఆయా పథకాలు మంజూరు చేయడం జగన్ పాలనలోనే సాధ్యమైందన్నారు. గామ సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ ప్రజలకు అన్నిరకాల సేవలు అందుబాటులోకి తెచ్చామని, దేశంలో అనేక రాష్ట్రాలు తమ రాష్ట్రాల్లో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయని అన్నారు. పేదల పిల్లలకు కార్పొరేటు సదుపాయాలతో విద్యను అందిస్తున్నామని, మీపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. చంద్రబాబు హయాంలో 30 లక్షలమందికి సామాజిక పింఛన్లు ఇవ్వగా, జగన్ అధికారంలోకి వచ్చాక 64 లక్షలమందికి పింఛన్లు ఇస్తున్నారని, అదికూడా పొద్దుపొడవకుండానే ఇంటికి వెళ్లి మరీ పింఛన్లు అందజేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పేదల కోసం ఏమంచి పని తలపెట్టిని జీర్ణించుకోలేని పచ్చమీడియా, ప్రతిపక్షాలు ఆపథకాల్లో అవినీతి అంటూ అసత్యప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని విమర్శించారు. మీరంతా జగనన్నకు అండగా ఉండాలని కోరారు. ఈసందర్భంగా ప్రజలనుంచి సమస్యలు తెలుసుకున్నారు. తమకు ఇళ్లస్థలాలు ఇవ్వాలంటూ పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఇప్పటికే గ్రామంలో దరఖాస్తు చేసుకున్న వారందరికి ఇళ్లస్థలాలు ఇచ్చామని, ఇంకా మిగిలి ఉన్న అర్హులందరికి మళ్లీ స్థలాలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మరడ మంగారావు, మండల సచివాలయ కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు, పి.బాలకృష్ణ, సందక రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు ఎలిశెట్టి బాబ్జి, పార్టీ నాయకులు రంగు వెంకటేశ్వరరావు, దూసనపూడి లక్ష్మీనారాయణ, ఎస్‌ఎస్ బాజీ, భావన సూరిబాబు, మంద జయలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో మోడల్ సచివాలయం నిర్మాణం



చల్లచింతలపూడిలో నిర్మాణం పూర్తయిన మోడల్ సచివాలయం

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడిలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో మంజూరైన రూ. 40 లక్షల నిధులతో మోడల్ సచివాలయ నిర్మాణం పూర్తయిందని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ బయ్యగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ అన్నారు. శుక్రవారం చల్లచింతలపూడిలో పూర్తి సౌకర్యాలతో అత్యంత ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న మోడల్ సచివాలయాన్ని నాని, శ్రీమన్నారాయణ, పంచాయతీ రాజ్ ఏఈ చౌదరి, గ్రామ కార్యదర్శి వాసు పరిశీలించారు. మోడల్ సచివాలయ నిర్మాణానికి విశేష కృషి చేసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు కామిరెడ్డి బాలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- సోమవరప్పాడులో గడపగడపకు మన ప్రభుత్వం



సోమవరప్పాడులో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం సోమవరప్పాడు ఆర్‌టీసీ కాలనీలో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, మండల వైస్ ప్రెసిడెంట్ వేమూరి జితేంద్ర, సర్పంచ్ సరిగే నాగరాజు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి నిర్వహించారు. ప్రతి ఇంటికీ ఎమ్మెల్యే వెళ్లి మూడున్నరేళ్లల్లో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు ఆయన వివరించారు. ఏ పథకానికి ఎంత నగదు మంజూరైంది వంటి వివరాలను కుటుంబ సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయిన్ ఏర్పాటు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, రేషన్‌కార్డుల్లో పేర్లు తొలగించడం, ఇంటి స్థలం మంజూరు, ఇంటి రుణం, స్వయం ఉపాధి, రోడ్డు నిర్మాణం, ఆలయం నిర్మాణం తదితర సమస్యలు స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలను ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బందితో నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలన్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హుల గుర్తింపు, ఆన్‌లైన్ ప్రక్రియలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తొత్తడి వేదకుమారి, సొసైటీ అధ్యక్షుడు నల్లూరి వెంకట్రామయ్య (బాబి), కొలుసు గణపతిరావు, పాకలపాటి శ్రీనివాసరావు, సర్పంచులు బోదుల స్వరూప్, చిలకా వెంకట సుబ్బారావు, దెందులూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, నాయకులు, కార్యకర్తలున్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ విజ్ఞాన సేవాధికారి సంస్థ కార్యదర్శి జీ రాజేశ్వరి

పెదపాడు: ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జీ రాజేశ్వరి తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జీ రాజేశ్వరి పెదపాడు, వసంతవాడలో ఫోక్సో చట్టాలు, జాతీయ లోక్ అదాలత్ అంశంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటికి ఫోక్సో చట్టం అమల్లోకి వచ్చి పదేళ్లు అయ్యిందని, ఇప్పటికీ ప్రజల్లో ఈ చట్టంపైన అవగాహన చాలా తక్కువ ఉందని అన్నారు. ప్రజలు ఈ చట్టంపైన పూర్తి అవగాహన కలిగి బాలబాలికలకు రక్షణ కల్పించుకోవాలని చెప్పారు. బాధితులు ఈ చట్టం ద్వారా నష్టపరిహారాన్ని పొందవచ్చునన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 11న దేశవ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాతీయలోక్ అదాలత్‌లో రాజీకి యోగ్యమైన అన్ని సివిల్, క్రిమినల్ కేసులను ఈ అదాలత్‌లో రాజీచేస్తారని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సమయాన్ని డబ్బును వృథాచేసుకోకుండా కేసులను సత్వరం పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ విజయరాజ్ కుమార్, పెదపాడు పోలీసు స్టేషన్ ఎస్‌ఐ బీ నాగబాబు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ పాల్గొన్నారు.

దోమల నివారణకు సస్య రక్షణ చర్యలు పాటించాలి



సూరప్పగూడెంలో రైతులకు తొడుగులను అందిస్తున్న యూనివర్శిటీ విద్యార్థులు

భీమడోలు: రైతులు దోమల నివారణకు సస్య రక్షణ చర్యలను పాటించడం ద్వారా నష్ట నివారణతో ఆర్థిక భరోసా కలుగుతుందని ఒరిస్సా సెంచూరియన్ యూనివర్శిటీ ఎగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు యల్లాప్రగడ శ్రీకర్, కొండిరెడ్డి లోకేష్‌లు అన్నారు. పని అనుభవంలో భాగంగా శుక్రవారం సూరప్పగూడెం గ్రామ రైతులు వరిలో సుడి దోమ నివారణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు హాజరైన వారి సమస్యలపై చర్చించారు. దోమల నివారణకు చల్లే పిచికారి మందులను వినియోగించే తరుణంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలను వివరించారు. రైతులు వ్యవసాయశాఖ అధికారులు అందించే సూచనలను పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. అనంతరం రైతులకు తొడుగులు, మాస్కులను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రైతులు వెజ్జు సత్యనారాయణ, త్రిమూర్తులు, పంతుల గంగాధర్, వెజ్జు వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధిక దిగుబడులు సాధించాలి



భీమడోలులో మేలైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ పి.ఉషారాజకుమారి

భీమడోలు: రైతులు అధునిక సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి అన్నారు. భీమడోలులో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి క్లస్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏవో ఎస్‌పీవీ ఉషారాణితో కలిసి ఏడీఏ ఉషారాజకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో మేలైన వ్యవసాయ పద్ధతులను ఆచరించడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. భాగస్వామ్య కార్యాచరణ పరిశోధన కార్యక్రమంలో ఆకులు కత్తిరింపు, పిలకలు కత్తిరింపుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల అనుమానాలను నివృత్తి చేసారు. .ఈ సందర్భంగా ఏడీఏ పి.ఉషారాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం లాభసాటిగా ఉండాలన్నదే వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం లక్ష్యమన్నారు. రైతులు వ్యవసాయ సహాయకులు, అధికారులు అందించే సూచనల మేరకు దాళ్వా సాగు చేసుకున్నట్లయితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణి, హబ్ ఏవో రవి, వ్యవసాయ గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు బువ్వనపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

నిడమర్రు: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం బువ్వనపల్లి గ్రామ సచివాలయం–2 పరిధిలో శనివారం ఉదయం 8 గంటలనుంచి ప్రారంభమవుతోందని వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్య కుమార్ తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని గ్రామంలో ఆయా కుటుంబా లకు ప్రభుత్వ పరంగా అందిన ఆర్థిక లబ్ధి వివరించి, వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమం కాకర్ల నరసింహరావు ఇంటి వద్దనుంచి హరిజనపేట, అల్లుమోలు వారి వీధి, మెయిన్‌రోడ్, వెంకటేశ్వరస్వామిగుడి వీధి వరకూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంకు అధికసంఖ్యలో వైసీపీశ్రేణులు పాల్గొవాలన్నారు.

నేడు కవ్వగుంటలో..

పెదవేగి : మండలంలోని కవ్వగంట గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల నాయకులు కేశన సతీష్ చెప్పారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని సతీష్ తెలిపారు. ప్రజాప్రతినిధులు,పార్టీ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సచివాలయ మండల కన్వీనర్ల నియామకం



సచివాలయ మండల కన్వీనర్లతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, రాష్ట్ర కోఆర్డినేటర్ పీ.ప్రతాప్‌రెడ్డి

దెందులూరు: సచివాలయ మండల కన్వీనర్లు పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో సచివాలయాల రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రతాప్‌రెడ్డితో కలిసి దెందులూరు నియోజకవర్గంలో సచివాలయ మండల కన్వీనర్లను ప్రకటించారు. దెందులూరు మండల కన్వీనర్‌గా కట్టా ఏసుబాబు, ఏలూరు మండల కన్వీనర్‌గా గుర్రం శివకుమార్, పెదపాడు మండల కన్వీనర్‌గా అక్కినేని గోపిచంద్రదుర్గాప్రసాద్, పెదవేగి మండల కన్వీనర్‌గా కేశిన సత్యనారాయణ నియమితులయ్యారని తెలిపారు. జగనన్న సచివాలయ మండల కన్వీనర్లు ఇకపై దెందులూరు నియోజకవర్గంలో సేవలందిస్తారని, నూతనంగా నియమితులైన సచివాలయ కన్వీనర్లను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రతాప్‌రెడ్డి అభినందించారు.

పథకాల అమలుకు అర్హతే ప్రామాణికం

పెదవేగి : ప్రభుత్వం అందించే పథకాల్లో అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారుల వివరాల నమోదు ప్రక్రియలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని జెడ్పీ సీఈఓ రవికుమార్ అన్నారు. పెదవేగి మండలంలో సచివాలయాల సిబ్బందికి పీఎంజేఏవై, ఈకేవైసీపై ఎంపీడీఓ జి. రాజ్‌మనోజ్ శుక్రవారం విజయరాయి సచివాలయంలో ఉద్యోగులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ పరిశీలించారు. గ్రామాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై గ్రేడ్ 5 కార్యదర్శులను, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను, వెల్ఫేర్ అసిస్టెంట్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు బురిల్లి నాగపెద్దింట్లు

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు–ఆశ్రం మధ్య శుక్రవారం రాత్రి సినీ ఫక్కీలో మహిళ మెడలో బంగారు గొలుసు చోరీకి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు నుంచి స్వగ్రామమైన గుండుగొలనుకు ద్విచక్రవాహనంపై తమ్ముడితో కలిసి బాధితురాలు బురిల్లి నాగపెద్దింట్లు వెళుతోంది. వెనుక నుంచి మరో వాహనంపై వస్తున్న ఇద్దరు ఆమె వాహనాన్ని వెంబడించి మెడలో ఉన్న గొలుసును అపహరించుకుపోయారు. బాధితురాలు, ఆమె తమ్ముడు నిందితులను గుర్తుపడతామని, కొమరేపల్లి వద్ద ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌ను చూపించాలని, దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది.

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



జంగారెడ్డిగూడెంలో డివిజన్ స్థాయిలో నాడు–నేడు పనులపై సమీక్షిస్తున్న విద్యాశాఖ ఆర్‌జేడీ, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జ్ డీఈవో

జంగారెడ్డిగూడెం: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషిచేస్తోందని విద్యాశాఖ ఆర్‌జేడీ, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జ్ డీఈవో డి.మధుసూధన్‌రావు అన్నారు. జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్లో డివిజన్ స్థాయిలో నాడు–నేడు పనుల పురోగతిపై శుక్రవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 58వేల కోట్లు ఖర్చు చేసిందని ఆయన అన్నారు. ఏలూరు జిల్లా పరిధిలోని 2వేల పాఠశాలల్లో, ఇప్పటికే నాడు–నేడు ద్వారా 1,500 పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. మిగిలిన పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు త్వరలో పనులు చేపడతామన్నారు. విద్యార్థుల అవసరాల దృష్ట్యా 880 అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలో సీబీఎస్‌ఈ విద్యను ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నామని ఆర్‌జేడీ మధుసూధనరావు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని కొన్ని పాఠశాలల్లో సీబీఎస్‌ఈని అమలు చేస్తున్నామన్నారు. రాబోయే 2024–25 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు సీబీఎస్‌ఈ విధానంలో పరీక్షలు రాసేవిధంగా ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులతో నాడు –నేడు పనులు, అదనపు తరగతి గదుల నిర్మాణం తదితర అంశాల పురోగతిపై చర్చించారు. సమీక్ష సమావేశంలో ఎస్‌ఎస్‌ఏ డీఈ పాలపర్తి రమణకుమారి, ఈఈ జయపాల్, డీవైఈవో రామన్నదొర, ఎంఈవోలు బి.రాముడు, జె.సురేష్‌బాబు, పాఠశాల హెచ్‌ఎం గెడా జగ్గారావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకారం అందించాలని వినతి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణాభివృద్ధి ప్రత్యేక సహకారం అందించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి విన్నవించారు. శుక్రవారం ఏలూరులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి ప్రత్యేక సహాయ సహకారాలు అందించాలని కోరారు. పట్టణ పరిధిలో ఉన్న పామాయిల్ ఫ్యాక్టరీ కారణంగా భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని, నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

వేళంగిణి మాత విగ్రహంతో ఊరేగింపు

దెందులూరు: ఖండ్రిక నర్సింహపురంలో శుక్రవారం వేళంగిణి 10వ గృహప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఏలూరు మేత్రసన్ ప్యారీస్ క్రైస్ట్ ఫాదర్ ఐ.మైఖేల్ ప్రత్యేక దివ్యబలి పూజ, జపమాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జయప్రకాష్, బ్రదర్ ఏసురాజు, పాస్టర్లు జయదాసు, బాబురావు, ఉపదేశీయులు బయ్యారపు మరీయదాసు ఆర్‌సీఎం సంఘస్తులు, మరియదళ సభ్యులు, ఆర్‌సీఎం సంఘపెద్దలు, గ్రామస్తులు వేళంగిణి 10వ గృహప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేళంగిణి మాత విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు.

సోషల్ ఆడిట్ సిబ్బందికి వసతి కల్పించండి

పెదపాడు: మండలంలోని ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సోషల్ ఆడిట్ త్వరలో నిర్వహించనున్నట్టు పెదపాడు జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రత్నకుమారి అధ్యక్షతన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీపీలు మాట్లాడుతూ మండలంలోని ప్రతీ గ్రామంలో సామాజిక తనిఖీలు నిర్వహించేందుకు తనిఖీదారులు వస్తారని తెలిపారు. వారికి సహకరించి విజయవంతంగా తనిఖీలు పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో వారు ఉండేందుకు వసతి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని సుమారు 2021–2022 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.12కోట్లతో ఉపాధిహామీ పనులు కల్పించామన్నారు. ఈకార్యక్రమంలో పెదపాడు మండల ఏఈ రవికుమార్ ఎస్‌ఆర్‌పీ బీ దాసు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.